చేవెళ్ల డిక్లరేషన్ అమలయ్యేలా కేటాయింపులు జరగలేదు

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు

నిజాంపేట్ : చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాలపీరు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. దళితుల విద్యా, వైద్యం రహదారులు, తాగు నీరు వంటి మౌలిక ప్రయోజనాలపై దృష్టి సారించలేదన్నారు. రాష్ట్రంలో 64 లక్షల జనాభా కలిగిన దళితులకు కనీస ప్రాథమిక అవసరాలు తీర్చే విధంగా బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అభయ హస్తానికి ఏటా రూ.750 కోట్లు కేటాయిస్తామన్న మాట నిలబెట్టుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ ఉపయోగిస్తే జరిమానా

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్



జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే చర్యలు తప్పవని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. కిరాణా షాపులు, హోటల్స్, రెస్టారెంట్లలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ (120 మైక్రోన్) కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వాడవద్దని వివరించారు. గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడే వారికి రూ.26,500 జరిమానా విధించారు. కార్యక్రమంలో మేనేజర్ బి లక్ష్మయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పి సాత్విక్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్

జీడిమెట్ల: ది ఆదర్శ్ కో ఆపరేటివ్ బ్యాంక్ రూపొందించిన ఆర్థిక నేరగాళ్ల మోసాల తీరు పుస్తకాన్ని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఎన్.వి.రమణారావు, షాపూర్‌నగర్ బ్రాంచ్ మేనేజర్ యాదగిరి, పడకంటి వెంకటేష్, ఎస్ఐలు నాయుడు, ప్రేమ్‌సాగర్, తేజశ్రీ పాల్గొన్నారు.

అదనపు ఇంటి పన్ను సమస్యను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీరేందర్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కాలనీ ప్రజలు అదనపు ఇంటి పన్ను కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదనపు ఇంటి పన్ను సమస్యను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ కోరారు. ఈ మేరకు గురువారం కాలనీ ప్రజలతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇంటి పన్నుపై ఇదివరకే కలెక్టర్‌తో చర్చించామని, ఏప్రిల్‌లోగా సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రయాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం



దుండిగల్: విద్యార్థులను భవిష్యత్‌లో నూతన సృష్టికర్తలుగా తీర్చిదిద్దడంతో పాటు వారిలో నైపుణ్యాలను పెంచే విధంగా తమ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని రయాన్ ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గ్రేస్ పింటో అన్నారు. దుండిగల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రయాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో రయాన్ ఇంటర్నేషనల్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ అగస్టీన్ ఫ్రాన్సిస్ పింటో, సీఈఓ రయాన్ పింటో తదితరులు పాల్గొన్నారు.

సున్నం చెరువు పనులు పూర్తి చేయాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్

మోతీనగర్: వచ్చే వర్షాకాలం నాటికి సున్నం చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్‌లో జరుగుతున్న సున్నం చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. పునరుద్ధరణ పనులకు కలుగుతున్న ఆటంకాలపై సమీక్షించారు.

ట్రా'ఫికర్'

- ఐడీపీఎల్ నుంచి సూరారం వరకు ట్రాఫిక్ తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



జీడిమెట్ల: ఐడీపీఎల్ చౌరస్తా నుంచి సూరారం వరకు రోజురోజుకు ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరుగుతుంది. ప్రైవేట్ వాహనాలు రోడ్లపై ఆపడం, ఫ్రీలెఫ్ట్ టర్నింగ్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగా లేకపోవడం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. ఒక్క ఉద్యోగి ఉదయం ఐడీపీఎల్ చౌరస్తా నుంచి సూరారం వెళ్లాలంటే 7 కిలోమీటర్ల దూరానికి కనీసం 30 నిమిషాల సమయం పడుతుంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఇటీవల ప్రధాన రోడ్డు అయిన నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో విపరీతమైన ట్రాఫిక్ పెరిగిపోయింది. ఉదయం స్కూల్, కళాశాలలు, పరిశ్రమల బస్సులు రద్దీగా ఉండగా మధ్యాహ్నం, సాయంత్రం సేమ్‌సీన్ రిపీట్ అవుతుంది. ట్రాఫిక్ అంతరాయానికి చెక్ పెట్టాలంటే ట్రాఫిక్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొన్ని మార్పులు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు.

- ఐడీపీఎల్ చౌరస్తా, చింతల్ బస్టాప్ వద్ద నిలిపే ప్రైవేట్ ట్రావెల్స్, కళాశాలల బస్సులకు ప్రత్యేకమైన స్టాపులు ఏర్పాటు చేయాలి.
- షాపూర్‌నగర్ రైతు బజార్‌వద్ద రోడ్లపై పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్న వారిని వెనకకు జరపాలి.
- షాపూర్‌నగర్ సాగర్‌హోటల్ వద్ద ఉన్న చౌరస్తాలో రోడ్లపై ఆటోలు ఆగకుండా చర్యలు తీసుకోవాలి. ఆటోస్టాండ్‌లో ఆటోలు నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
- టీఎస్ఐఐసీ కాలనీ బస్టాప్‌లో వాహనాలు రోడ్లపై కాకుండా కాస్తా ఎడమవైపున నిలిపేలా అధికారులు డ్రైవర్లకు అవగాహన కల్పించాలి.
- డీపీ కాలనీ చౌరస్తా సిగ్నల్‌వద్ద సైతం సిగ్నల్ పడిన సమయంలో ఎడమవైపునకు వెళ్లే వాహనాలు సాఫీగా వెళ్లేలా బారీకేడ్లు ఏర్పాటు చేయాలి.
- జీడిమెట్ల బస్‌డిపో వద్ద తప్పకుండా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ పరిశ్రమల బస్సులు డిపో చౌరస్తాలో కాకుండా ఐటీపీ పెట్రోల్‌బంక్ దాటి నాక ఆపేలా చూడాలి.
- జీడిమెట్ల ఫేజ్ 4 నుంచి వచ్చే వాహనాలు నేరుగా రోడ్డు దాటకుండా కాస్తా ముందుకు వెళ్లి పాతరెడ్డిల్యాబ్ వద్ద యూటర్న్ తీసుకునేలా చేయడం ద్వారా డిపో చౌరస్తాలో ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు.
- జీడిమెట్ల డిపో వద్ద బాలానగర్ వైపు వెళ్లే బస్టాపును ప్రస్తుతం ఉన్న చోటు నుంచి మరో 30 మీటర్ల దూరం మార్చడం ద్వారా ట్రాఫిక్‌ను తగ్గించవచ్చు.
- సూరారం సిగ్నల్‌కు వచ్చే సరికి సూరారం విలేజ్‌వైపు వెళ్లే వాహనాలు సాఫీగా వెళ్లేలా బారీకేడ్లు ఏర్పాటు చేయాలి.

ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నాం



ప్రతి నిత్యం జీడిమెట్ల నుంచి బాలానగర్ వెళ్లాలంటే డీపీ కాలనీ, షాపూర్‌నగర్, రంగాబుజంగా, షా థియేటర్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ప్రతినిత్యం ట్రాఫిక్‌లో చిక్కుకోవడం వల్ల ఆఫీస్‌కు 30 నిమిషాల వరకు లేట్ అవుతుంది. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకుని స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి. కొన్ని మార్పులు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉంటుంది. – శ్రీనివాస్‌రెడ్డి, ప్రైవేట్ ఉద్యోగి



కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, నీరజల కుమారుడు వెంకట్రామిరెడ్డి, పావనిల రిసెప్షన్ బుధవారం రాత్రి నగరంలోని జేఆర్‌సీ కన్వెన్షన్స్‌లో జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. - కుత్బుల్లాపూర్

ఎమ్మార్పీఎస్ అమరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కల సాకారమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్‌మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించారు. అమరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 30 సంవత్సరాల పోరాటంలో ఎందరో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆత్మ బలిదానం చేశారని, వారికి నేడు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ, జిల్లా యువసేన ప్రధాన కార్యదర్శి ఇసురం రమేష్ మాదిగ, సలోమి, మట్టా నర్సింహులు, కురుమయ్య, విజయ్ కుమార్, అరుణ వాణి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు నీటి తొట్టెలు ఏర్పాటు



నీటి తొట్టెలో నీటిని నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

సుభాష్‌నగర్: వేసవి కాలంలో అడవిలో ఉన్న వన్య ప్రాణులకు, పక్షులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ తెలిపారు. దూలపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 2,00,500 హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయని తెలిపారు. సూరారం, గాజులరామారం, బౌరంపేట్ అడవుల్లో చెరువులు, కుంటల్లో వేసవి కాలానికి సరిపడా నీళ్లు ఉన్నాయన్నారు. నీరు లేని ప్రాంతాల్లో పక్షులు, వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి ప్రత్యేకంగా నీటి తొట్టెలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటి సమస్య తలెత్తకుండా ప్రతిరోజు తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు.

బిల్లుల చెల్లింపు వరకు పారదర్శంగా వ్యవహరించాలి



రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఎస్ఈ చిన్నారెడ్డి

కుత్బుల్లాపూర్: ఇంజినీరింగ్ అధికారులు పనులు రూపొందించే సమయంలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని, రికార్డులు మొదలుకొని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే వరకు పారదర్శకంగా వ్యవహరించాలని కూకట్‌పల్లి జోనల్ ఎస్ఈ చిన్నారెడ్డి అన్నారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించి అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు ఎంతమంది కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేశారు.. వారికి బిల్లులు ఏ విధంగా చెల్లిస్తున్నారు.. తాజాగా రూపొందించిన పనుల వివరాలను ఆరా తీశారు. అనంతరం భగత్ సింగ్ నగర్‌లో సీఎం ఆర్ఎంపీ నిధులతో చేపడుతున్న నాలా పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో నాలా పనులు పూర్తి చేయాలని, పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత ఇంజినీర్ దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను దశలవారీగా కాంట్రాక్టర్లకు చెల్లించే విధంగా జాబితాను తయారు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో డీఈలు శిరీష, రూపాదేవి, డీఏఓ లక్ష్మణరావు, ఏఈలు తిరుపతి, అశోక్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షులు ఐలయ్య గౌడ్

జగద్గిరిగుట్ట: సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం డాక్టర్ జాంగిర్ హుస్సేన్ అధ్యక్షతన జగద్గిరిగుట్టలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు, మైనార్టీలకు అండగా ఉంటుందన్నారు. బీసీలకు 42 శాతం, ఎస్సీ వర్గీకరణ శాసనసభలో ఆమోదించిన సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. రాష్ట్రీయ దళిత సేన జాతీయ చైర్మన్ జేబీ రాజు ఆధ్వర్యంలో సీఎంను కలిసి హైదరాబాద్‌లో లక్ష మందితో అభినందన సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో రాష్ట్రీయ దళిత సేన మైనార్టీ విభాగం జాతీయ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ జాంగిర్ హుస్సేన్, దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ భూదల అమర్ బాబు, రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షులు జేమ్స్, ప్రధాన కార్యదర్శి బాలరాజు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ వీజేఐఈటీలో ముగిసిన సాంస్కృతికోత్సవం



పాట పాడుతున్న గాయకుడు కార్తీక్

నిజాంపేట్ : ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో సిన్‌డిలేషన్ 25 వేడుకలు విజయవంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు ఆటపాటలతో, సంప్రదాయ వస్త్రధారణతో సందడిగా సాగింది. కార్యక్రమంలో ప్రముఖ చలనచిత్ర గాయకుడు కార్తీక్ అలరించారు. అనంతరం మ్యాడ్ స్క్వేర్ చిత్ర బృందం విద్యార్థుల సందడి నడుమ తమ చిత్రానికి ప్రచారం కల్పించారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడి అరెస్ట్

కుత్బుల్లాపూర్: బెల్ట్ షాపు నిర్వాహకునిపై కేసు నమోదైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం. గుండ్లపోచంపల్లికి చెందిన నవీన్‌గౌడ్ దుకాణంపై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అక్రమ మద్యం బాటిళ్లు లభ్యం కావడంతో నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ మహిళ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రావులపల్లికి చెందిన శ్రీనివాస్, శాంతకుమారి(40) లు భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని అరమ్స్‌బర్గ్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇళ్లల్లో పనిచేసే శాంతకుమారి (40) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ పై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే స్కాలర్‌షిప్‌లు



గోలి శ్యామలను సత్కరిస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: క్రీడాకారులను ప్రోత్సహించాలనే ప్రతి సంవత్సరం రూ.1.5 కోట్లు క్రీడా కోటా కింద స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని ఎంఎల్ఆర్ ఐటీ కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని కళాశాలలో గురువారం కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి 81వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రముఖ స్విమ్మర్ గోలి శ్యామలను ఘనంగా సత్కరించి రూ.25 వేల నగదును అందజేశారు. అదే విధంగా వివిధ క్రీడల్లో సత్తా చాటిన పలువురిని అభినందించి నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి మర్రి మమతా రెడ్డి, డైరెక్టర్ శ్రేయారెడ్డి, డైరెక్టర్ మర్రి దీరన్‌రెడ్డి, మర్రి అరుంధతి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్ రావు, వివిధ విభాగ అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారిణి స్వర్ణలత

దుండిగల్: పోషకాహార లోపం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల క్షయ వ్యాధి వ్యాపిస్తుందని మండల వైద్యాధికారిణి డాక్టర్ స్వర్ణలత అన్నారు. ఈ నెల 24న క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా దుండిగల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి, అరికట్టే విధానాలు, ఉచిత వైద్య పరీక్షలు, చికిత్స కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సిరాజుద్దీన్, సూపర్‌వైజర్లు రమేష్, చంద్రకళ, లతీఫా, క్షయ విభాగ ఉద్యోగులు కిశోర్, శ్రవణ్, రవీందర్, ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న తైబజార్ వేలం పాట

నిజాంపేట్: నిజాంపేట్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి రోజువారి, వారాంతపు మార్కెట్లు తైబజారు కమిషనర్ ఆధ్వర్యంలో సర్కారీ వారి పాట రూ.19,50,000లు నిర్ణయిస్తూ ఈ నెల 27న ఉదయం 11.30 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. వేలంలో తైబజార్ హక్కులు పొందిన వారు 50 శాతం నగదు, 6 చెల్లుబాటు అయ్యే చెక్కులు 7 రోజులలో నగర పాలక సంస్థకు జమ చేసి అగ్రిమెంట్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి నెల 5వ తేదీలోగా సూచించిన నెలవారి వాయిదా చెల్లించాలన్నారు. ఆసక్తి గలవారు మున్సిపల్ కార్యాలయం నందు రూ.3000 నగదు చెల్లించి, లేదా కమిషనర్ నిజాంపేట్ నగర పాలక సంస్థ హైదరాబాద్ నందు చెలుబాటు అయ్యే డిమాండ్ డ్రాఫ్ట్‌ను సమర్పించాలన్నారు. నియమ నిబంధనలతో కూడిన దరఖాస్తును గురువారం ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తును రూ.3 లక్షల డీడీతో పాటు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఏదైనా సమాచారం కావాలంటే కార్యాలయ సమయంలో పన్నుల విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ భరత్ కుమార్

సుభాష్‌నగర్: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని సూరారం సీఐ భరత్ కుమార్ అన్నారు. జీడిమెట్లలోని అరోర్ ఫార్మాసిటికల్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో నర్సాపూర్, బాలానగర్ ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఎండ నుంచి ఉపశమనం పొందడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ్‌నగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

చలివేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్

రంగారెడ్డినగర్: ఆదర్శ్‌నగర్‌లోని అలవి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆసుపత్రి యాజమాన్యం సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆదర్శ్ నగర్ కాలనీ వెల్ఫేర్ ప్రెసిడెంట్ శంకరయ్య, సౌభాగ్య నగర్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, నాయకులు రవీందర్ గుప్తా, అరుణ పాల్, నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి!

కుత్బుల్లాపూర్: పాతగొడవల నేపథ్యంలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చింతల్ బాపునగర్‌కు చెందిన బత్తుల సాయబన్న (30), బత్తుల మహేష్ (28) బంధువులు. తమ ఇంటి సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఆవును కట్టేసిన విషయమై ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మహేష్ ఆవేశానికిలోనై సాయబన్న పొత్తికడుపు, మెడపై కత్తితో పొడిచి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన సాయబన్నను సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరు పెళ్లిళ్లల్లో సన్నాయి మేళం వాయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరి మధ్య పాత గొడవల నేపథ్యంలోనే కత్తిపోట్ల దాడికి దారి తీసిందని తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు గురువారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ తలపై పగిడి పెట్టి శాలువతో సత్కరించి ఖడ్గాన్ని అందజేశారు. – జగద్గిరిగుట్ట

బిల్లుల ఆమోదంపై కాంగ్రెస్ సంబురాలు



కొంపల్లిలో బైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో..



గండిమైసమ్మలో క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ అన్నారు. చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజ్వరేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిన సందర్భంగా గురువారం కొంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ దేవేందర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, ఆదిరెడ్డి మోహన్‌రెడ్డి, జయభేరి గోపాల్‌రెడ్డి, షేక్ ఇబ్రహీం, మల్లేష్, అంజి, రాముతదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉప కులాలకు న్యాయం

దుండిగల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేసిందని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిన సందర్భంగా గండిమైసమ్మ చౌరస్తాలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మున్సిపల్ అధ్యక్షుడు చింతకింద సురేశ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాముగౌడ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్రోళ్ల సదానందం, ఓబీసీ సెల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కుమార్ యాదవ్, అర్కల విజయ్‌గౌడ్, పరశురాం గౌడ్, రాహుల్, ధర్మారెడ్డి, చెవిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.